క్లుప్తంగా

'సంఘమిత్ర' వార్షికోత్సవం



నర్సంపేట : బాలభవన్‌లో సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ 7వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు గొంగళ్ల అశోక్ మాట్లాడారు. ఆర్గనైజేషన్ ఏడు వసంతాలు పూర్తి చేసుకుని 8వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సంస్థకు సహకారం అందిస్తున్న సభ్యులు, సలహాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సంఘమిత్ర సలహాదారు పెన్మత్స సుబ్బరాజు రాసిన 'రక్తం-రక్తదానం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు తోట రవి, చేపూరి ప్రశాంత్, గషికంటి రాణి, పెండ్యాల రాకేశ్, తొగరు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్ గ్రామంలోని ఆర్‌డీఎఫ్ హైస్కూల్ విద్యార్థిని ముక్కెర హాసిని ఉమ్మడి వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికవగా ఆమెను హెచ్‌ఎం బాషబోయిన రాములు, ఉపాధ్యాయులు సోమవారం బొకే అందజేసి అభినందించారు. అనంతరం హెచ్‌ఎం రాములు మాట్లాడారు. హాసిని ఆదివారం జరిగిన అండర్-10 వంద మీటర్ల అథ్లెటిక్స్‌లో పాల్గొని 5వ ర్యాంకు సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ఇన్‌చార్జ్ జె.బాలరాజు, పీఈటీ సురేశ్, సునీల్ పాల్గొన్నారు.

కమిటీ నియామకం

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండలోని హితకారిణి సేవా సంఘం కార్యాలయంలో గటిక మల్లయ్య అధ్యక్షతన బీసీ కులాల ఐక్య వేదిక కమిటీని సోమవారం నియమించారు. అధ్యక్షుడిగా గటిక మల్లయ్య, కన్వీనర్‌గా బోనాల సాంబయ్య, కోకన్వీనర్లుగా కుడికాల వెంకటేశ్వర్లు, దెంచనాల వెంకటేశ్వర్లు, సభ్యులుగా గాద్దుల సంపత్, ఇద్దం దూడయ్య, పుట్ట స్వామి, శివరాత్రి వెంకటేశ్వర్లు, ఓరుగంటి దేవేందర్, ఆవుల సంపత్, గటిక స్వామి, నాగెల్లి వెంకటేశ్వర్లు, రాచకొండ అశోక్ నియమితులయ్యారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పర్వతగిరి : మండలంలోని అన్నారంలో ఆదివారం అర్ధరాత్రి పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి రూ.12 వేల 20 నగదుతోపాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం.. గ్రామంలోని గుండ నాగేందర్ ఇంటి వద్ద పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న రాపోలు యాకయ్య, రియాజ్, ధీకొండ కుమార్, కొండ వెంకన్న, అమ్జద్ పాషాలను అరెస్ట్ చేయగా నాగేందర్ పారిపోయాడు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామానికి చెందిన బొమ్మల శంకర్, తదితరులు ఆర్‌ఎంకు గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం శంకర్ మాట్లాడారు. గ్రామానికి గతంలో బస్సు సౌకర్యం ఉండగా నిలిపివేశారని తెలిపారు. దీంతో గ్రామంలోని రైతులు, విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరారు.

నివాళి

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన బత్తిని చిన్నవీరయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్ సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మురళి, లాల్‌సాహెబ్, చాంద్‌పాషా, నర్సయ్య, మారగాని లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట : పట్టణంలోని పాత్‌ఫైండర్ స్కూల్ బస్ డ్రైవర్ పొన్నం సురేశ్ కాలు ప్రమాదంలో విరిగిపోయిన క్రమంలో అతడికి ప్రైవేట్ స్కూల్ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ బాధ్యులు సోమవారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత సురేశ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు నాలం రాజు, ప్రధాన కార్యదర్శి వనపర్తి భిక్షపతి, నాయకులు లక్క రాజు, నాగరాజు, నగేశ్, కోటి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దుగ్గొండి : గిర్నిబావిలో కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసరెడ్డి, నాయకులు



ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఊరూరా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులతోపాటు నాయకులు వైఎస్సార్ అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల పండ్లు పంపిణీ చేశారు. కేకులు కట్ చేశారు. అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ అందించిన సేవలను గుర్తు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



నల్లబెల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు



పర్వతగిరిలో..



రాయపర్తిలో..



రాయపర్తి : పెర్కవేడులో ..



నెక్కొండ : కేక్ కట్ చేస్తున్న నాయకులు



రాయపర్తి : వర్ధన్నపేటలో..

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం



గీసుకొండ : చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతీఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. మండలంలోని కాపుల కనపర్తిలో సోమవారం నిర్వహించిన వనమహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. అవగాహనా రహిత్యంతో విచక్షణారహితంగా చెట్లను నరికివేయడంతో పర్యావరణం దెబ్బతిని సకాలంలో వర్షాలు కురవని దుస్థితి నెలకొందని చెప్పారు. పంట పొలాలపైనా, ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని కోరారు. అనంతరం స్థానిక రైతు వేదికలో మండలంలోని 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీఓ వేదవతి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గీసుకొండ : మండలంలోని కోనాయమాకులలోని రైతువేదికలో మండలంలోని 48 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చెక్కుల పంపిణీ జాప్యం జరిగేదని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సత్వరమే సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, నాయకులు దుపాకి సంతోశ్, తుమ్మనపెల్లి శ్రీనివాస్, సాయిలి ప్రభాకర్, వజ్ర రాజు, దౌడు భరత్, రుద్రారపు ప్రసాద్, దౌడు ప్రవీణ్, యుగేందర్, కొమ్ము శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సంగెం : మొక్క నాటి నీరు పోస్తున్న ప్రకాశ్‌రెడ్డి

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

సంగెం : మండలంలోని ముమ్మడివరంలోని సిద్దార్థ స్కూల్‌లో 2004-05 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల కలుసుకుని నాడు విద్యాబోధన అందించిన గురువులను ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీగారపు సుధాకర్, నాటి ఉపాధ్యాయులు లెంకలపల్లి మొగిలి, కొనకటి మొగిలి, దుడ్డె వెంకటేశ్వర్లు, కోటగిరి శ్రీనివాస్, పెండ్లి కుమారస్వామి, చంద్రస్వామి, చంద్రమౌళితోపాటు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల తోడ్పాటు



నల్లబెల్లి : విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం వసంత

నల్లబెల్లి : ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం వసంత తెలిపారు. ఆ స్కూల్ గణిత ఉపాధ్యాయురాలు అడ్డగూడూరి పద్మజ తన తల్లి జ్ఞాపకార్థం సొంత డబ్బుతో 150 మంది విద్యార్థులకు రూ.7 వేల విలువైన టై, బెల్టులు సమకూర్చగా హెచ్‌ఎం వసంత సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, సంతోశ్ కుమార్, అన్నాదేవి, బుచ్చన్న, కొమురయ్య, జ్యోతి, హాము, ఫిజికల్ డైరెక్టర్ శంకరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే మెరుగైన విద్యాబోధన

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ స్కూళ్లలోనే మెరుగైన విద్యాబోధన లభిస్తుందని మండలంలోని కమ్మపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ దూపటి సరిత తెలిపారు. ఉపాధ్యాయులు సొంత డబ్బుతో సమకూర్చిన నోట్‌బుక్స్, ఐడీ కార్డులను విద్యార్థులకు సోమవారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు సొంత డబ్బుతో నోట్‌బుక్స్, గుర్తింపు కార్డులు అందించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవం ఉన్న ఉపాధ్యాయులు బోధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సర్దార్, సీఆర్పీ దూపటి చంద్రమౌళి, ఉపాధ్యాయులు వసంతరాణి, కవిత పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : విద్యార్థులతో చైర్మన్ సరిత

పెద్దవాగు బ్రిడ్జిపై గుంతలతో ప్రమాదాలు

● వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఇబ్బందులు

సంగెం : సంగెం పెద్దవాగు బ్రిడ్జిపై గుంతలు ప్రమాదకరంగా పరిణమించాయి. వర్షపు నీరు నిల్వ ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా సమస్యను పరిష్కరించడంలో ఆర్ అండ్ బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండల కేంద్రం నుంచి వరంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారి అయిన సంగెం పెద్దవాగు బ్రిడ్జి మండలంలోని పలు గ్రామాల నుంచి వరంగల్ నగరానికి వెళ్లడానికి ప్రధాన రహదారి. ఈ బ్రిడ్జి మీద గుంతలు తేలి ప్రమాదకరంగా మారాయి. వీటికి తోడు వర్షపు నీరు నిల్వ ఉంటుండడంతో గుంతల లోతు తెలియక పలువురు ద్విచక్ర వాహనదారులు పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. గతేడాది ఈ బ్రిడ్జి మీద గుంతల్లో పడి గవిచర్ల గ్రామానికి చెందిన ఒకరు మృతి చెందారు. ఇప్పటివరకు పలువురు ఆస్పత్రుల పాలయ్యారు. ఆటోలు గుంతల్లో దిగబడిన ఘటనలు అనేకం అంటే అతిశయోక్తి లేదు. అధికారులు పట్టించుకోకపోతుండడంతో ఆటోడ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో సొంతంగా డబ్బులు వేసుకుని గుంతలను పూడ్చారు. తదనంతరం కాలక్రమంలో గుంతలు చిన్నచిన్నగా మొదలై ప్రస్తుతం పెద్దగా మారి ప్రమాదకంగా తయారై ద్విచక్ర వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. గుంతలో పడి ఒకరు ప్రాణం కోల్పోయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రంలోనూ రోడ్డుపై గుంతలు తేలిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా బ్రిడ్జికి సమీపంలో ఉన్న లోలేవల్ కాజ్‌వే వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినపుడు కాజ్‌వే పొంగిపొర్లితే వాహనాల రాకపోకలు నిలిచిపోవడం పరిపాటి. దానిపై పెద్ద మోరీలు వేయాలని లేదా బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి పెద్ద వాగు బ్రిడ్జిపై ఉన్న, మండల కేంద్రంలోని రోడ్డుపైనున్న గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



పలుమార్లు ప్రమాదాలు



బ్రిడ్జి వద్ద గుంతలు ప్రమాదకరంగా ఉండడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. గుంతల్లో నీరు నిలిచి లోతు తెలియక అనేక మంది పడిపోయిన పరిస్థితి ఉంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు నానాటికీ గుంతలు మరింత పెద్దగా అవుతున్నాయి. అధికారులు, చొరవ తీసుకుని గుంతలు పూడ్చాలి.

–రామవత్ మోహన్, రైతు, చింతలపల్లి

గుంతల్లో సీసీ వేయిస్తాం

సంగెం పెద్దవాగు బ్రిడ్జిపైన, మండల కేంద్రంలో గుంతలు పడిన విషయం మా దృష్టికి రాలేదు. బ్రిడ్జి వద్ద గుంతలు పడిన చోట వర్షపు నీరు నిలుస్తుండడంతో బీటీ లేచిపోతోంది. త్వరలో గుంతల్లో సీసీ వేయిస్తాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చొరవ తీసుకుంటాం. ప్రమాదాలు నివారించే దిశగా చర్యలు చేపడతాం.

–సుమలత, ఆర్అండ్‌బీ ఏఈ

'ఆరు గ్యారంటీలు' అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రాయపర్తి (వర్ధన్నపేట) : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ అనుబంధ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కర్క సోమిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం సోమిరెడ్డి మాట్లాడారు. రైతులకు ఆంక్షలు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా పేరుతో రూ.15 వేల పంట పెట్టుబడి ఇవ్వాలని, కౌలు రైతులకు పెట్టుబడి కోసం రూ.15 వేల సాయం అందించాలని, రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, నాయకులు నాంపల్లి యాకయ్య, సంపత్‌రెడ్డి, పెద్దారి రాజ్‌కుమార్, సత్యం, సుభాశ్, విక్కీ, సిద్దం శ్రీనివాస్, ఎల్లస్వామి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో డ్రాయింగ్ కాంపిటీషన్

నర్సంపేట : నేడు (మంగళవారం) జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించనున్న సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో పట్టణంలోని మదర్స్‌ల్యాండ్ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులు డ్రాయింగ్‌లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ మాట్లాడారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ చైతన్యవంతం చేసే దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ పి.నవిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నాల శశికుమార్, కార్యకర్తలు ఆకాశ్, ఆది, హేమంత్, పాఠశాల చైర్మన్ పాశికంటి రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నవిత

గ్రామీణుల సౌకర్యార్థం మీసేవా కేంద్రాలు

దుగ్గొండి : గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం మండలంలోని పలు గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మీసేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఏపీపీ రేణుకాదేవి తెలిపారు. మండలంలోని తిమ్మంపేట, మహ్మదాపురం, లక్ష్మీపురం, నాచినపల్లి, తొగర్రాయి, వెంకటాపురం గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటు కోసం సోమవారం ఆమె స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా నాచినపల్లిలోని పంచాయతీ ఆవరణలోని హాల్‌లో పరిశీలించి మాట్లాడారు. గ్రామ మహిళా సమాఖ్య పర్యవేక్షణలో కేంద్రాలు నడుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం అనిత, ఏపీఎం గుజ్జుల రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు ముక్కెర ఆనంద్, వాణి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.



గదిని పరిశీలిస్తున్న ఏపీడీ రేణుకాదేవి

ప్రత్యేక అధికారిగా వేదవతి



సంగెం : మండల ప్రత్యేక అధికారిగా వరంగల్ డీఎల్‌పీఓ వి.వేదవతి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఎంపీడీఓ కాసర్ల రవీందర్ పూలబొకే అందించి స్వాగతం పలికారు. అనంతరం వేదవతి మాట్లాడారు. మండల స్థాయి అధికారుల సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

కారు డ్రైవర్ అదృశ్యం



నరేశ్ (ఫైల్)

గీసుకొండ : జాన్‌పాకకు చెందిన కారు డ్రైవర్ గజా నరేశ్ అదృశ్యమయ్యాడు. నరేశ్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ ఏడాది మార్చి 10న హైదరాబాద్‌లో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. నరేశ్ ఆచూకీ తెలియకపోవడంతో అతడి భార్య ఉమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాబూలాల్ తెలిపారు.

దారి కబ్జాపై చర్యలు తీసుకోండి



గ్రీవెన్స్ సెల్‌లో ఇచ్చిన దరఖాస్తును చూపిస్తున్న రాజేశ్వరి

రాయపర్తి (వర్ధన్నపేట) : తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లే దారిని కబ్జా చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన మంచోజు రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో రాజేశ్వరి మాట్లాడారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యవసాయ భూమికి పక్కనున్న భూమిని కొనుగోలు చేసి తమ పొలానికి వెళ్లే దారిని కబ్జా చేసినట్లు తెలిపారు. సదరు అక్రమార్కులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఖానాపురం : విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాజీవ్ బాలస్వాస్థ్య కార్యక్రమ్ (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గుండా రవీందర్, ప్రిన్సిపాల్ సదాకర్ తెలిపారు. మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఆర్‌బీఎస్‌కే వైద్య శిబిరంలో పలువురు విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న విద్యార్థులను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలోని డీఈఐ సెంటర్‌కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గుండా రవీందర్, ప్రిన్సిపాల్ సధాకర్ మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మృదుల, ఫార్మాసిస్ట్ అన్నపూర్ణ, ఏఎన్ఎం దివ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

నర్సంపేట : స్థానిక మున్సిపాలిటీలో పని చేస్తున్న 13 మంది ఎన్ఎంఆర్ కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి సుంచు జగదీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని యూనియన్ బృందం జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం జగదీశ్ మాట్లాడారు. ఎన్ఎంఆర్ కార్మికులకు వేతనాలు పెంచాలని గతేడాది డిసెంబర్‌లో జీఓ విడుదల చేసినా ఇప్పటివరకు అమలు చేయకపోవడం సరికాదన్నారు. వేతనాలను సకాలంలో సైతం ఇవ్వడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. జీఓ ప్రకారం వేతనాలు పెంచాలని అధికారులను కోరినా స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. తక్షణమే ఎన్ఎంఆర్ కార్మికుల వేతనాలు పెంచడంతోపాటు ఇక నుంచి సకాలంలో అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్, జిల్లా కమిటీ సభ్యుడు రాగినేని ఐలయ్య పాల్గొన్నారు.